

సేల్స్‌మెన్ దారుణ హత్య

మంచి ఆదాయ మార్గంగా ఉన్న స్నేహితుడి పోస్ట్‌పై కన్నేసిన ఓ యువకుడు అతడిని దారుణంగా హత్య చేశాడు. 10లో▸



పని చేస్తున్న చోటే చోరీ

పని చేస్తున్న గోదాంలోనే లాకర్‌లో ఉన్న డబ్బులను దొంగిలించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. 10లో▸



డీజీపీగా తులేకలాన్ బిడ్డ

తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన శివధర్‌రెడ్డి మన జిల్లా వాసే. తులేకలాన్ ఆయన స్వగ్రామం. 10లో▸

న్యూస్‌రీల్

రేపు ఫోర్త్ సిటీకి సీఎం రేవంత్‌రెడ్డి!

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫోర్త్ సిటీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సందర్శించే అవకాశం ఉంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి రానున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఏర్పాట్లు చేయాలని తనకు సూచించినట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. ఫోర్త్ సిటీలో ఇప్పటికే శంకుస్థాపనలు చేసిన పనులను సీఎం పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

కేశంపేట: ఉపాధి పథకంలో సిబ్బంది నిబంధనలకు లోబడి పని చేయాలని డీఆర్‌డీఓ పీడీ శ్రీలత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వలసల నివారణ కోసం ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీడీలు సుభాషిణి, చరణ్‌గౌతమ్, ఏంపీడీఓ రవిచంద్రకుమార్, ఎంపీఓ కిష్టయ్య, అజీజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐలమ్మకు ఘన నివాళి



ఐలమ్మకు నివాళి అర్పిస్తున్న అధికారులు

తుక్కుగూడ: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సంగీత మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సునీల్, కేశురాం పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాలు తయారు చేసిన పిండి వంటలు ప్రదర్శించారు. స్టాల్స్‌ను అడిషనల్ కలెక్టర్ సందర్శించి వ్యాపార అభివృద్ధికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీడీ వెంకటనారాయణ, ఏఓ జైత్‌రాం, డీఎంసీ ఇందిర, సిబ్బంది అశోక్, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ శివారులో చిరుత కలకలం!

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారులో చిరుతపులి కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, దేశ్‌ముఖి గ్రామాల సరిహద్దుల్లో ఉన్న కుమ్మరికుంట, సున్నంగుండు పరిసరాల్లో శుక్రవారం మధ్యాహ్నం గొర్రెల కాపరి ఐలయ్యకు చిరుతపులి కనిపించింది. దేశ్‌ముఖి గ్రామానికి చెందిన ఐలయ్య తన గొర్రెల మందను సున్నంగుండు సమీపంలో మేపుతుండగా అకస్మాత్తుగా ఓ చిరుతపులి మందలోని ఓ గొర్రెపిల్లపై దాడి చేసేందుకు యత్నించిందని తెలిపాడు. తన అరుపులకు గొర్రె పిల్లను అక్కడే వదిలి పారిపోయినట్లు చెప్పాడు. వెంటనే విషయాన్ని గ్రామస్తులకు తెలిపాడు.

చైతన్యం కోసమే బతుకమ్మ ఉత్సవాలు

ఇబ్రహీంపట్నం: మహిళలను చైతన్య పరిచేందుకే బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత తెలిపారు. ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను సమాజంలో గౌరవిద్దాం, ఆడపిల్లలను పుట్టనిద్దాం, మహిళలను రక్షించుకుందామన్నారు. మహిళల రక్షణకు అనుగుణంగా చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత, విజయమ్మ, కవిత, స్వప్న, ఉమ, అరుణ, విజయ, సంతోష, అనురాధ, విజయ, సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: పారుతున్న పహిల్వాన్ చెరువు అలుగు

రోజంతా వాన

ఈసీ, మూసీ వాగులకు పోటెత్తిన వరద

- జంట జలాశయాల నుంచి నీటి విడుదల
- స్తంభించిన జనజీవనం
- రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన పంటలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో వర్షం దంచి కొట్టింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు, కుంటలు మత్తడి దూకాయి. జిల్లేడు చౌదరిగూడ మండలం గుర్రంపల్లి గ్రామానికి చెందిన 60 ఏళ్ల వ్యక్తి వాగు దాటుతూ వరదలో కొట్టుకుపోయి చనిపోయాడు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. భారీ వర్షంతో జనజీవనం పూర్తిగా స్తంభించి పోయింది. ఓఆర్ఆర్ సహా విజయవాడ జాతీయ రహదారితో పాటు చేవెళ్ల, శ్రీశైలం, షాద్‌నగర్ జాతీయ రహదారులపైకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

షాబాద్‌లో అత్యధిక వర్షపాతం

తెలంగాణలోనే అత్యధికంగా షాబాద్ మండలం తాళ్లపల్లిలో 10.50 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మండల కేంద్రంలో 10.23 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చందనవెల్లిలో 8.63 సెం.మీ, మొగిలిగిద్దలో 7.95 సెం.మీ, కొందుర్గులో 7.60 సెం.మీ, చౌదరిగూడ మండలం కాసులాబాద్‌లో 6.78 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఈసీ, మూసీ వాగులకు వరద పోటెత్తడంతో జంట జలాశయాల గేట్లు బార్లా తెరిచారు.



శంకర్‌పల్లి: టంగటూరు వద్ద వరద నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న గ్రామస్తులు

అప్రమత్తం చేసిన రెవెన్యూ యంత్రాంగం

రోజంతా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండటంతో అత్యవసర పనులున్న వారు మినహా ఇతరులెవరూ ఇంటి గడపదాట లేదు. వర్షానికి చలిగాలులు తోడవడంతో చిన్నారులు, వృద్ధులు రోజంతా దుప్పట్లోనే ముసుగేసి కన్పించారు. చెరువులు, కుంటలు పొంగి ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను జిల్లా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం చేసింది. శంకర్‌పల్లి మండలం టంగుటూరు వద్ద మూసీ వాగు పొంగి ప్రవహిస్తుండటంతో స్థానికులను అలెర్ట్ చేసింది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసింది. శిథిల భవనాల నుంచి తక్షణమే ఖాళీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.



చేవెళ్ల: పామెన సమీపంలో వాగు పొంగి పొర్లుతుండడంతో నిలిచిన రాకపోకలు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో గులాబీ తోటను ముంచెత్తిన వరద



కొందుర్గు: ఇంద్రానగర్‌లో నీట మునిగిన వరిపంట

బస్సెక్కు.. బహుమతి పట్టు

- దసరా సందర్భంగా ఆర్టీసీ బొనాంజా
- లక్కీ డ్రా ద్వారా ముగ్గురికి నగదు నజరానా
- నిర్ణీత తేదీల్లో ప్రయాణించే వారికే అవకాశం



షాద్‌నగర్: దసరా సందర్భంగా మీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణించనున్నారా.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సొంతూళ్లకు వెళ్తున్నారా.. అయితే మీరు నగదు బహుమతులు గెలుచుకునే అవకాశాన్ని టీఎస్ఆర్టీసీ కల్పిస్తోంది. లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని నిర్ణయించింది.

నేటి నుంచి అక్టోబర్ 6 వరకు

ఈనెల 27 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు డీలక్స్, సూపర్ లగ్జరీ, అన్ని ఏసీ బస్సుల్లో ప్రయాణించేవారికి నగదు బహుమతులు అందజేయనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద నగదు అందించనున్నారు. నిర్ణయించిన బస్సుల్లో ప్రయాణించే వారు బస్సులో తీసుకున్న టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్, చిరునామా రాసి బస్సుల్లో, బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సుల్లో వేయాలి.

అక్టోబర్ 10న లక్కీ డ్రా

అధికారులందరి సమక్షంలో అక్టోబర్ 10న లక్కీ డ్రా నిర్వహించనున్నారు. రీజియన్ పరిధిలో లక్కీ డ్రాలో గెలుపొందిన ప్రయాణికులకు మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నారు.

ప్రత్యేక బస్సులు

బతుకమ్మ, దసరా వేడుకల సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించనుంది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు అధికంగా ప్రయాణించే ప్రాంతాలకు అదనపు బస్సులు నడిపిస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటికే సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో పలు డిపోల్లో అదనపు సర్వీసులు తిరుగుతున్నాయి.

సౌకర్యవంతమైన సేవలు



ఆర్టీసీ సౌకర్యవంతమైన, సురక్షితమైన సేవలు అందిస్తోంది. రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడిపిస్తాం. దసరా పండగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి సంస్థ లక్కీ డ్రా ద్వారా నగదు బహుమతులు అందజేయనుంది.

– ఉష, డిపో మేనేజర్, షాద్‌నగర్

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి శ్రీధర్‌బాబు

కందుకూరు: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకెళ్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని శుభం కన్వెన్షన్‌లో శుక్రవారం జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ మూడో మహాసభలు నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజానికి అద్దం పట్టే వృత్తిదారులని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపు, విద్యార్థులకు ఫీజు రాయితీ, ఆరోగ్య భద్రత వంటి అంశాలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. సుప్రీం కోర్టు తీర్పుతో ఇళ్ల స్థలాల విషయంలో సందిగ్ధత ఏర్పడిందని, న్యాయ నిపుణులు సూచించిన మార్గంలో న్యాయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, పీసీసీ ప్రధానకార్యదర్శి ఏ.జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.జంగారెడ్డి, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సోమయ్య, బస్వపున్నయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సైదులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

రైతులకు నష్టం జరిగితే ఊరుకోం

- ట్రిపుల్‌ఆర్ పేరుతో అన్యాయం చేయొద్దు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: ట్రిపుల్‌ఆర్ పేరుతో రైతులకు నష్టం చేస్తే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ పేరుతో చిన్న, సన్నకారు రైతుల భూములను లాక్కుంటోందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వ భూముల నుంచి చేయడం జరిగిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చి కొత్త అలైన్‌మెంట్ నిర్ధారించిందని, దీంతో పెద్ద సంఖ్యలో రైతులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోకపోతే ట్రిపుల్‌ఆర్ బాధిత రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు పత్యానాయక్, బీఆర్ఎస్ నాయకులు చుక్కా నిరంజన్‌గౌడ్, సయ్యద్ ఖలీల్, వడ్డె వెంకటేశ్, శంకర్, బాస్కర్, మహేశ్‌నేత, నిరంజన్, సైదులుగౌడ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జీపీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు

ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం డీపీఓ సురేష్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 3,116 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పండగ పూట పంచాయతీ కార్మికులను పస్తులుంచడం తగదని పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, ఎస్. చందునాయక్, శ్రీను, జోగు మాధవి, జాపాల జంగయ్య, దేవదాస్, కవిత, కృష్ణ, పాండు, భాస్కర్, కవిత, శంకరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



డీపీఓ సురేష్‌మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇక స్థానిక సందడి!

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ విడుదల
- నేడు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దసరాకు ముందే ఎన్నికల పండగొచ్చింది. ఎప్పుడెప్పుడా అని అంతా ఆశగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శుక్రవారం జీఓ నంబర్ 9ని విడుదల చేసింది. శనివారం మధ్యాహ్నం తర్వాత ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. తొలి విడతలో పార్టీ గుర్తుపై పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. తర్వాతే సర్పంచ్, వార్డు మెంబర్లకు ఎన్నికలు నిర్వహించనుంది. జిల్లాలో 21 జెడ్పీటీసీ, 230 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వీటిలో తొమ్మిది జెడ్పీటీసీ, 97 ఎంపీటీసీ స్థానాలు బీసీలకు దక్కనున్నాయి. ఇప్పటికే జెడ్పీ రిజర్వేషన్లను కలెక్టర్, జెడ్పీ సీఈఓలు ఖరారు చేయగా, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను ఆర్‌డీఓలు, డీపీఓలు.. వార్డులను ఎంపీఓలు ఖరారు చేశారు. ఆయా రిజర్వేషన్ల జాబితా కలెక్టర్ వద్ద సీల్డ్ కవర్‌లో భద్రంగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఆయా రిజర్వ్‌డ్ స్థానాలను ప్రకటించే చాన్స్ ఉంది. రెండు వారాల వ్యవధిలోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉంది.

అలుగు కాలువ తవ్వకం

- తొర్రూరు–బ్రాహ్మణపల్లి రహదారిలో పనులు
- హైడ్రా, ఇరిగేషన్ అధికారులను అడ్డుకున్న రైతులు

తుర్కయంజాల్: తొర్రూరు బ్రాహ్మణపల్లి రోడ్డులో శుక్రవారం హైడ్రా అధికారులు అలుగు కాలువ తవ్వడంతో స్థానికంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. మున్సిపల్ పరిధి తొర్రూరు ఎర్రకుంటలోని నీరు దిగువకు వెళ్లేలా తొర్రూరు–బ్రాహ్మణపల్లి రహదారిలో అలుగు నిర్మాణం చేపట్టేందుకు గత సంవత్సరం ఇరిగేషన్ అధికారులు పనులు ప్రారంభించగా స్థానిక రైతుల ఆందోళనతో తాత్కాలికంగా నిలిపివేశారు. అలుగు నిర్మాణం కోసం రోడ్డును తవ్విన అధికారులు తిరిగి పునరుద్ధరించకపోవడంతో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రహదారిలో పూర్తిగా వరదనీరు నిలిచి రాకపోకలు నిలిచిపోయాయి. ఇరు ప్రాంతవాసుల విజ్ఞప్తి మేరకు తాజాగా హైడ్రా, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు ఎర్రకుంట కాలువ తవ్వకం చేపట్టారు. ఈ క్రమంలో అలుగు దిగువన తమ భూమి నుంచి కాలువను తీయొద్దంటూ తొర్రూరుకు చెందిన రైతులు రాజ్‌కిరణ్, ఇందిరమ్మ కుటుంబ సభ్యులు హైడ్రా అధికారులను అడ్డుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే తమ పొలం నుంచి కాలువ తీస్తున్నారని, తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రకుంట చెరువు దిగువన కొందరి భూములను ఎఫ్‌టీఎల్ పరిధి నుంచి తొలగించడానికే అలుగు లేని చోట నుంచి కాలువ తవ్వుతున్నారని ఆరోపించారు. హైడ్రా అధికారులు వారిని అదుపులోకి తీసుకుని తవ్వకం చేపట్టారు. అనంతరం హైడ్రా అధికారి తిరుమలేష్ మాట్లాడుతూ.. తొర్రూరు– బ్రాహ్మణపల్లి రహదారిలో నీరు భారీగా నిలిచిపోవడంతో ఇరు ప్రాంతాలకు రాకపోకలు ఆగిపోయాయని తెలిపారు. ప్రస్తుతం వరదనీరు వెళ్లడానికి కాలువ తవ్వుతున్నామని, ఇంకా అలుగు నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు. నిర్ధారణ అయిన తరువాతే అలుగు నిర్మాణం చేపట్టి కాలువను పూర్తి స్థాయిలో తవ్వుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ వంశీధర్‌గౌడ్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారి దినేష్, హయత్‌నగర్ పోలీసులు, హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.



బ్రాహ్మణపల్లి రోడ్డులో కొనసాగుతున్న పనులు

రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

- సీఆర్ఐఎఫ్ కింద నిధులు
- రూపురేఖలు మారనున్న జిల్లా రహదారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ వ్యాప్తంగా 34 రోడ్ల విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ (సీఆర్ఐఎఫ్) పథకం కింద విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఆయా రోడ్ల విస్తరణకు ఆమోదం తెలుపుతూ కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ ఇటీవల తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి లేఖ రాసింది.

జిల్లాలో ఇలా..

- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కప్పపహాడ్ నుంచి గున్‌గల్ మీదుగా తులేకలాన్ వరకు 8.2 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఇదే నియోజకవర్గంలోని బేగంపేట్ నుంచి ఎలిమినేడు మీదుగా మాదాపూర్ వరరకు 6.2 కిలోమీటర్ల సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్‌గా మార్చేందుకు రూ.17 కోట్లు మంజూరు చేసింది.
- మహేశ్వరం నియోజకవర్గంలోని లేమూరు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి మీదుగా తిమ్మాపూర్ వరకు 14 కిలోమీటర్ల సింగిల్ లేన్‌ను డబుల్‌రోడ్డుగా విస్తరించేందుకు రూ.38 కోట్లు కేటాయించింది.
- చందానగర్ నుంచి చేవెళ్ల నియోజకవర్గంలోని కవేలిగూడ మీదుగా పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్ వరకు 14 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లు కేటాయించింది.
- వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం రంగాపూర్ నుంచి లాల్‌పహాడ్ రోడ్డు (14.35 కి.మీ) విస్తరణకు రూ.22 కోట్లు మంజూరు చేసింది.

సేల్స్‌మెన్ దారుణ హత్య

- జల్‌పల్లి శ్రీరామ కాలనీలో ఘటన
- స్నేహితుడే హంతకుడు


చందు తివారీ

పహాడీషరీఫ్: మంచి ఆదాయ మార్గంగా ఉన్న స్నేహితుడి పోస్ట్‌పై కన్నేసిన ఓ యువకుడు, అతన్ని దారుణంగా హత్య చేసిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌కు చెందిన కొండకింది సురేందర్‌రెడ్డి జల్‌పల్లి శ్రీరామ కాలనీలోని తన షెడ్డును రాజస్థాన్‌కు చెందిన జగదీశ్ అనే వ్యక్తికి అద్దెకిచ్చాడు. ఇందులో ఖుష్బూ కలర్, కెమికల్స్ కంపెనీ నిర్వహణతో పాటు మిగిలిన స్థలంలో ముడి సరుకును నిల్వ ఉంచుతున్నారు. ఇందులో సన్వర్ మాల్ అనే వ్యక్తి సూపర్‌వైజర్‌గా, రాజస్థాన్‌కు చెందిన టెక్ చందు తివారీ (35) అనే యువకుడు సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నారు. టెక్ చందు తివారీ అసిస్టెంట్‌గా తన స్నేహితుడు ఇమ్రాన్‌ను నియమించుకొని, కంపెనీలోని ఓ గదిలో నివాసం ఉంటున్నారు. రాజస్థాన్‌లో నివాసం ఉండే యజమాని కంపెనీపై అంతగా పర్యవేక్షణ చూపకపోవడంతో సేల్స్‌మెన్‌గా ఉన్న తివారీ వ్యాపారం మొత్తాన్ని తన కనుసన్నల్లో నడుపుతూ దండిగా డబ్బులు సంపాదించసాగాడు. ఈ విషయాన్ని తన అనుచరుడిగా ఉన్న ఇమ్రాన్‌తో పంచుకునేవాడు. ఈ క్రమంలోనే ఇమ్రాన్ కూడా తనకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలంటూ తివారీతో తరచూ గొడవ పడేవాడు. అయినప్పటికీ అతడు పెద్దగా పట్టించుకోకపోవడంతో, తివారీని మట్టుబెట్టితే ఆ పోస్ట్ తనకు వస్తుందని భావించాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం 10 గంటలకు వీరి గదికి వెళ్లిన సన్వర్ మాల్‌కు.. టెక్ చందు తివారీ మంచంపై మృతి చెంది కనిపించాడు. వెంటనే యజమాని, పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా తివారీ తల వెనుక భాగంలో, కాలు, ఇతర భాగాలలో కత్తితో పొడిచిన గాయాలున్నాయి. మృతదేహం పక్కనే కత్తితో పాటు ఓ కర్ర లభ్యమైంది. తివారీ, ఇమ్రాన్‌ల నడుమ గొడవల కారణంగానే ఇమ్రాన్ హత్య చేసి పరారయ్యాడని సురేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై హత్యానేరం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇమ్రాన్ కోసం గాలింపు చేపట్టారు.

డీజీపీగా తులేకలాన్ బిడ్డ

- పోలీస్‌బాస్‌గా శివధర్‌రెడ్డి నియామకం
- స్వగ్రామంలో సామాజిక కార్యక్రమాలు
- గ్రామ ప్రజలతో అనుబంధం


శివధర్‌రెడ్డి కుటుంబం


శివధర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన శివధర్‌రెడ్డి మన జిల్లా వాసే. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ ఆయన స్వగ్రామం. తల్లిదండ్రులు రాజకిషన్‌రెడ్డి -రాజ్యలక్ష్మి. అక్కలు నర్సమ్మ, అరుణమ్మ, రుద్రమ్మ, తమ్ముడు రంగనాథ్‌రెడ్డి ఉన్నారు. వీరి చిన్నతనంలోనే తల్లి మరణించింది. తండ్రి కూడా అనతి కాలంలోని వారికి దూరమయ్యాడు. దీంతో మేనత్త అనంతమ్మ పెంపకంలో పెరిగాడు. ప్రాథమిక విద్య గున్‌గల్, తులేకలాన్ గ్రామాల్లో అభ్యసించాడు. అనంతరం రెండో అక్క నర్సమ్మ వద్ద హైదరాబాద్‌లోని లింబోలిఅడ్డాలో పెరిగాడు. చాదర్‌ఘాట్ బాలుర పాఠశాలలో విద్యాభ్యాసం సాగించాడు. ఇంటర్మీడియెట్ బడిచౌడిలోని చైతన్య కళాశాలలో, డిగ్రీ లక్డీకాపూల్‌లోని బీజేఆర్ డిగ్రీ కళాశాలలో, ఎల్‌ఎల్‌బీ ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకున్నాడు.

వ్యవసాయ పనులు చూస్తూ..

అప్పట్లో కూలీలు హర్తాల్ చేసే సమయంలో గ్రామానికి వస్తుండేవాడు. అప్పుడప్పుడు వ్యవసాయ పనులు చూసుకోవడం చేస్తుండేవాడు. ఎప్పుడూ చేతిలో కెరియర్ గైడెన్స్ పుస్తకం పట్టుకొని చదువుతుండడం అలవాటు. కెప్టెన్ లింగాల పాండురంగం అనే రిటైర్డ్ ఆర్మీమెన్ దగ్గర శిక్షరికం చేస్తుండేవాడు. లా చదువుకొని న్యాయవాద వృత్తిలో కొనసాగుతుండగానే సివిల్ సర్వీసెస్ పరీక్ష రాశాడు. 1994లో ఐపీఎస్‌గా ఎంపికయ్యాడు.

వివిధ హోదాల్లో..

మొదటి పోస్టింగ్ ఏఎస్పీగా విశాఖపట్నంలోని అనకాపల్లిలో వచ్చింది. నర్సీపట్నం, చింతపల్లిలో పని చేశారు. గ్రేహౌండ్స్, స్క్వాడ్రన్ కమాండర్‌గా, బెల్లంపల్లి, ఆదిలాబాద్, నల్లగొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు జిల్లాల ఎస్పీగా సేవలందించారు. ఎస్పీగా, డీఐజీ, ఎస్ఐబీగా మావోయిస్టుల అణిచివేతలో కీలకపాత్ర పోషించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఇంటలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించారు.

పేదల సంక్షేమానికి తోడ్పాటు

గ్రామస్తులతో శివధర్‌రెడ్డికి ఎనలేని అనుబంధం ఉంది. ఏటా దసరా, సంక్రాంతి పండగలకు గ్రామానికి విచ్చేసి స్థానికులతో మమేకమవుతుంటారు. గ్రామం అభివృద్ధిలో భాగంగా పేదలకు సొంత భూమిలో ఇళ్ల స్థలాలకు భూమి ఇచ్చారు. అంబేడ్కర్ భవనానికి, చర్చికి స్థలాలు కేటాయించారు. లైబ్రరీ నిర్మాణం కోసం కృషి చేశారు. అక్కాచెల్లెళ్ల వివాహాల కోసం వారికి భూములు రిజిస్ట్రేషన్లు చేశారు. ఇబ్రహీంపట్నం, తులేకలాన్ అంటే ఆయనకు ఎనలేని అభిమానం. డీజీపీగా తమప్రాంతంవాసి నియమితులు కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


యాదయ్య (ఫైల్)

కడ్తాల్: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. ముద్వీన్ గ్రామానికి చెందిన రమణమోని యాదయ్య(49), మైసిగండిలో గొర్రెలు మేపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం రాత్రి మైసిగండి సమీపంలో శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన అతన్ని అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పని చేస్తున్న చోటే చోరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: తాము పని చేస్తున్న గోదాంలోనే చోరీకి పాల్పడి లాకర్‌లో ఉన్న డబ్బులను దొంగిలించిన నిందితులను షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు పట్టణ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన వత్తి శ్రీకాంత్, ఫరూఖ్‌నగర్‌కు చెందిన మొదంపల్లి మధు, షాద్‌నగర్‌లో నివాసం ఉంటున్న గుజరాత్ రాష్ట్రానికి చెందిన మౌలిక్ దిలీప్ బాయ్ దేవ్‌లు షాద్‌నగర్ శివారులోని జడ్చర్ల రోడ్డులో ఉన్న ఎన్‌టీఎక్స్ గ్రాసరీ గోదాంలో కొంత కాలంగా పని చేస్తున్నారు. గోదాంలోని సరుకులను వివిధ ప్రాంతాలకు వారు డెలివరీ చేయడంతో పాటుగా డబ్బులుకలెక్షన్ చేస్తున్నారు. అక్కడే మేనేజర్‌గా పని చేస్తున్న ప్రవీణ్ ఈనెల 17న కలెక్షన్ ద్వారా వచ్చిన రూ.4.21లక్షలు లాకర్‌లో ఉంచి ఇంటికి వెళ్లాడు. అదే రోజు రాత్రి గోదాంలో పని చేస్తున్న శ్రీకాంత్, మధు, మౌలిక్ దిలీప్ బాయ్ షెట్టర్ తాళాలను పగలగొట్టి లాకర్‌ను దొంగిలించారు. ఈ మేరకు గోదాం మేనేజర్ ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక నైపుణ్యంతో నగదు చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను షాద్‌నగర్, శంషాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి కారు, మూడు సెల్‌ఫోన్లు, రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్సుల రద్దు


పొంగిపొర్లుతున్న కంకణాలపల్లి వాగు

బంట్వారం: బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కంకణాలపల్లి, నూరుల్లాపూర్ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వికారాబాద్, కోట్‌పల్లి లోకల్ బస్సును శుక్రవారం పూర్తిగా రద్దు చేశారు.

ఉప్పొంగిన కాగ్నా


కోకట్ కాగ్నా బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

యాలాల: మండంలో భారీ వర్షం పడుతుండటంతో కాగ్నా, కాకరవేణి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోకట్ కాగ్నా నది బ్రిడ్జిపై నుంచి ఉప్పొంగడంతో తాండూరు-రాస్నం మార్గంలో రాకపోకలు నిలిచాయి. జుంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరుతుండటంతో నిండుకుండలా మారాయి.

రోడ్డు మూసివేత


వాగు పొంగడంతో అల్లాపూర్ వద్ద రోడ్డు మూసివేత

కుల్కచర్ల: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో వాగులు పొంగి పొర్లాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కుల్కచర్ల మండల పరిధిలోని రాంనగర్, ముజాహిద్‌పూర్, అల్లాపూర్, ఘనపూర్ గ్రామాల్లో చెరువులు నిండాయి.

ధారూరులో కుండపోత

ధారూరు: కుండపోత వానకు మండలంలోని మోమిన్‌కుర్దు-మోమిన్‌కలాన్, హరిదాస్‌పల్లి-చింతకుంట, నాగారం-మైలారం, తరిగోపుల-జైదుపల్లి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దాదాపు 13 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. రుద్రారం-నాగసమందర్ గ్రామాల మధ్య కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీరు ప్రవహిస్తున్నాయి.


నాగారం-మైలారం మధ్య కాగ్నా ఉపనది ఉగ్రరూపం


ఉధృతంగా కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగునీరు

మళ్లీ ఉరిమిన వరుణుడు

విరామం లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు వరుణుడు తన ప్రతాపాన్ని చాటాడు. దీంతో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. పంట పొలాల్లోకి వరదనీరు పోటెత్తింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ముఖ్యంగా ఈసీ, మూసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో వాగు దాటే క్రమంలో ఓ వ్యక్తి వరద ప్రవాహానికి కొట్టుకుపోయాడు. స్థానికులు, పోలీసులు గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. దీంతో ప్రజలు సురక్షితంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. పంటలు మునగడంతో వరి, పత్తి తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


రేగడిఘనాపూర్ వద్ద వాగులోని చెత్తను తొలగిస్తున్న జేసీబీ

ప్రవాహానికి కొట్టుకుపోయిన బైక్

చేవెళ్ల: మండలంలోని రెండు వైపులా ఉన్న ఈసీ, మూసీ నదులు ఒకేసారి ఉధృతంగా ప్రవహించాయి. పామెన, తల్లారం, అంతారం, కౌకుంట్ల, ఆలూరు, ధర్మసాగర్, దేవరంపల్లి గ్రామాల్లో ఉన్న వాగులు సైతం ఉగ్రరూపం దాల్చాయి. రేగడిఘనాపూర్ వద్ద ఓ యువకుడు వాగు దాటుతుండగా ప్రవాహానికి బైక్ కొట్టుకుపోయింది. సదరు వ్యక్తి క్షేమంగా బయట పడ్డాడు.


వాగు దాటుతుండగా అదుపుతప్పిన బైక్

ఉధృతంగా మూసీ నది


చించల్ పేట వద్ద భీకరంగా మూసీ నది

నవాబుపేట: మండలంలో మూసీ నది పొంగిపొర్లింది. పక్కన ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో నీట మునిగాయి. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమంతా వర్షం పాలు అవుతుందని విలపిస్తున్నారు.


ముబారక్‌పూర్ రైల్వే వంతెన వద్ద వరద నీరు


మంచన్‌పల్లి వాగు వద్ద ట్రాక్టర్‌ను అడ్డుపెట్టిన గ్రామస్తులు

నీట మునిగిన పంటలు

పూడూరు: మండలంలో కంకల్ ఈసీ వాగు ఉప్పొంగడంతో సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. దీంతో కంకల్ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. మిట్టకంకల్, కుత్బుల్లాపూర్, రేగడిమామిడిపల్లి, బార్లపల్లి, చన్గోముల్, పుడుగుర్తి, గ్రామాల్లోని వాగులు నిండుకుండలా పారుతున్నాయి.


కంకల్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై పారుతున్న వరద నీరు


ప్రొద్దటూరు వద్ద ఉధృతంగా మూసీ వాగు

బారికేడ్ల ఏర్పాటు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి, మోకిల-టంగటూర్, ప్రొద్దటూర్-టంగటూర్ మధ్య ఉన్న రెండు బ్రిడ్జిలపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి గ్రామాల మధ్య రాకపోకలను నిషేధించారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జిని పరిశీలించారు.


నీట మునిగిన వరి పంట

కూలిన ఇల్లు

కందుకూరు: మండల పరిధిలో భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. పొలాల నుంచి కాలువల ద్వారా కుంటలు, చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతుంది. వర్షాలతో బాచుపల్లి గ్రామంలోని ఎర్ర జంగయ్యకు చెందిన ఇల్లు గోడ కూలింది.


బాచుపల్లిలో గోడ కూలిన ఇంటిని పరిశీలిస్తున్న స్థానికులు

పొలాల్లోకి వరద నీరు


రక్షమైసమ్మ దేవాలయం వద్ద వర్షం జోరు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నక్కలపల్లి, వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి, అమ్డాపూర్ గ్రామాల పక్కనే ఉన్న ఈసీ వాగు పంటపొలాల గుండా ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పూల తోటలు నీటిలో తేలి కనిపిస్తున్నాయి. అమ్డాపూర్ సమీపంలో ఈసీ వాగు బ్రిడ్జిపై సందర్శకుల తాకిడి నెలకొంది.


అమ్డాపూర్ వద్ద ఈసీ వాగు ఉధృతి

స్తంభించిన రాకపోకలు

నందిగామ: నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లే రహదారిలోని వాగు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. చంద్రాయాన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడకు వెళ్లే దారి లోని వాగు, నందిగామ నుంచి పిత్తిల్యామినేషన్ పరిశ్రమ పక్కనుంచి వీర్లపల్లికి వెళ్లే రహదారిలోని వాగు సైతం ఉధృతంగా ప్రవహించాచయి.


నందిగామ-నర్సప్పగూడ మార్గంలో వాగు ఉధృతి

ఉగ్రరూపం దాల్చిన వాగులు

కొందుర్గు: మండలంలోని టేకులపల్లి, ముట్పూర్, రేగడిచిల్కమర్రి, గంగన్నగూడ, విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల, లాలపేట, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని రావిర్యాల, గుర్రంపల్లి, చేగిరెడ్డిఘనాపూర్, తుమ్మలపల్లి, తూంపల్లి గ్రామాల్లో వాగు లు ఉగ్రరూపం దాల్చాయి.


భీకరంగా రేగడిచిల్కమర్రి వాగు


కాజ్‌వే పై ఉధృతంగా ప్రవహిస్తున్న ముట్పూర్ వాగు